క్లుప్తంగా

లలితానగర్‌లో బీటీ రోడ్ల నిర్మాణం



లలితానగర్‌లో కొత్తగా నిర్మించిన బీటీ రోడ్డు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు లలితానగర్‌లో రహదారులు మెరిసిపోతున్నాయి. నిన్న మొన్నటి వరకు రాళ్లు తేలిన రోడ్లు.. నేడు కొత్తగా కనిపిస్తున్నాయి. లలితానగర్‌లోని లలితా పీఠం రోడ్డుతోపాటు పలు అనుబంధ రహదారుల్లో కొత్తగా బీటీ రోడ్లు నిర్మించారు. అభివృద్ధి పనుల్లో భాగంగా వార్డులోని పలు ప్రాంతాల్లో రహదారులు, సీసీ డ్రెయిన్లు నిర్మిస్తున్నారు. శిథిలమైన రోడ్లు, డ్రెయిన్ల స్థానంలో కొత్తవి నిర్మించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నరసింహనగర్ రైతుబజార్‌లో మరమ్మతులు



బజార్‌లో కొత్త రేకులు అమర్చుతున్న సిబ్బంది

సీతంపేట: నాడు–నేడు కార్యక్రమం కింద రైతు బజార్లలో మౌలిక వసతుల కల్పన, మరమ్మతులు చేపడుతున్నారు. నరసింహనగర్ రైతు బజార్‌లో రూ. 9 లక్షలతో మరమ్మతులు నిర్వహిస్తున్నారు. స్టాల్ పైకప్పుగా వేసిన సిమెంట్ రేకులు పాడవడంతో వర్షం పడితే లీకై రైతులు ఇబ్బంది పడుతున్నారు. పాత రేకులు తొలగించి కొత్తగా సిమెంట్ రేకులు వేస్తున్నారు. సమస్య పరిష్కారం కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ చినబాబు పర్యవేక్షిస్తున్నారు.

200 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ హరిప్రసాద్

మురళీనగర్: స్థానిక వైశాఖి స్పోర్ట్స్ పార్కులో పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ మల్ల హరిప్రసాద్ నేతృత్వంలో వైద్యులు నాగరాజన్, సతీష్‌కుమార్ పండా, ఎస్‌వీకే రాజు, కల్యాణ్ ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలపై వైద్య పరీక్షలు చేశారు. ఆస్తమా వ్యాధితో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ, పార్కు కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యక్షుడు బి.శ్రీనివాస్, చంద్రమౌళి, కోశాధికారి కూర్మారావు, ఎం.రామకృష్ణ, బీటీ స్వామి, రఘురామ్ పండా పాల్గొన్నారు.

వైద్యుల సేవలు అభినందనీయం



వైద్యులను సత్కరిస్తున్న జైభీమ్ సంస్థ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ, సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న గ్రామీణ వైద్యుడు, ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు, గ్రామీణ వైద్యురాలు నాగమణి, సత్యను జైభీమ్ సంస్థ సత్కరించింది. పేదలకు వైద్య సేవలు అందించడం అభినందనీయని సంస్థ సభ్యులు కొనియాడారు. కార్యక్రమంలో మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ రమ్యారెడ్డి, డాక్టర్ భవాని, డాక్టర్ శ్వేత, సూర్యప్రసాద్, ఎస్.పద్మ, జైభీమ్ కన్వీనర్, అవంతి కంప్యూటర్స్ డైరెక్టర్ కోన ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం.. పుణ్యకార్యం



వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద అన్నదాన భవంతి



భవనంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

- వైభవుడి దివ్యక్షేత్రంలో నారాయణ సేవ
- మూడు అంతస్తుల్లో అన్నసమారాధన భవనం
- భక్తులకు దిగ్విజయంగా అన్నప్రసాద వితరణ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రం ఆధ్యాత్మికంగా వెలుగొందుతోంది. వైభవుడి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతోపాటు సంప్రదాయ సిద్ధంగా పూజలు చేస్తున్నారు. ఆలయంలో అనేక అదనపు సౌకర్యాలు కల్పించారు. పురాణ ఘట్టాలతో కూడిన విగ్రహాలను ఏర్పాటు చేయగా వైభవుడి క్షేత్రంలో అన్నదాన సత్రం అదనపు హంగుగా చెప్పుకోవచ్చు. దీంతోపాటు గోశాల నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ గో పూజలు చేస్తున్నారు.

చినజీయర్ స్వామి సువర్ణ హస్తాలతో ప్రారంభం

ఆలయం వద్ద అలవేలు మంగమ్మ అన్నదాన భవనాన్ని దాతల సాయంతో రూ.3 కోట్లతో నిర్మించారు. ఈ భవంతిని త్రిదండి చినజీయర్ స్వామి తన సువర్ణ హస్తాలతో ప్రారంభించారు. అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ అన్నదాన భవంతిని మూడు అంతస్తుల్లో నిర్మించారు. మొదటి అంతస్తులో భక్తులు కూర్చుని భోజనాలు చేయడానికి భోజన శాల, రెండో అంతస్తులో బఫే భోజనం చేయడానికి వీలుగా ఏర్పాట్లు చేశారు. మూడో అంతస్తును పీఠాధిపతుల వసతికి ఆచార్య సన్నిధానం, కాన్ఫరెన్స్ హాల్‌గా ఉపయోగిస్తారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల వసతి కోసం మూడు గదులు కేటాయించారు. గ్రౌండ్ ఫ్లోర్‌ను వంటశాల, కూరగాయల భద్రతా గదిగా వినియోగిస్తున్నారు.

ప్రతి శనివారం అన్నసమారాధన

వైభవ వేంకటేశ్వర స్వామికి సుప్రభాత సేవా కార్యక్రమం పూర్తికాగానే ప్రతి శనివారం మధ్యాహ్నం ఆలయం ప్రాంగణంలో నారాయణ సేవలో భాగంగా అన్నసమారాధన జరిగేది. ప్రస్తుతం అన్నదాన భవంతి అందుబాటులోకి రావడంతో అక్కడే అన్నసమారాధన నిర్వహిస్తున్నారు. గతంలో 200 మందికి నిర్వహించే అన్నసమారాధన నేడు 300 మందికి పెంచారు. దాతలు కూడా ఇందుకు సహకరించడంతో అన్నసమారాధన కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగుతోంది.

నిత్యాన్నదానానికి ప్రయత్నాలు



వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని మరింత శోభాయమానంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు చేస్తున్నాం. స్థానిక దాతలు, ఎన్‌జీజీవోస్ కాలనీ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, స్థానిక కార్పొరేటర్ ఇందుకు సహకరిస్తున్నారు. రానున్న కాలంలో నిత్యాన్నదానం నిర్వహించాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి.

– బండారు ప్రసాద్, ఆలయ కార్యనిర్వహణాధికారి

స్నేపర్ పార్కు ప్రారంభానికి సన్నాహాలు



బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో స్నేపర్ పార్కును పరిశీలిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు

సీతమ్మధార: సుందర విశాఖకు మరింత వన్నె తెచ్చేలా రూ.2.5 కోట్లతో స్నేపర్ పార్కును తీర్చిదిద్దుతున్నట్లు నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు తెలిపారు. 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని స్నేపర్ పార్కు అభివృద్ధి పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మరి కొద్ది రోజుల్లో పార్కు పనులన్నీ పూర్తి చేసి, ఈ నెల చివరి వారంలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే కడియం, రాజమహేంద్రవరం ప్రాంతాల నుంచి తెప్పించిన పలు రకాల పువ్వుల మొక్కలు, చెట్లు నాటినట్లు చెప్పారు. ప్రజలు సేదతీరేలా పార్కులో నాలుగు వాకింగ్ ట్రాక్‌లు, సీతాకోకచిలుకల ఉత్పత్తి కేంద్రం, పిల్లల ఆట స్థలం, వర్షం ఆశ్రయాలు, పెర్గోలా, లిల్లిపాండ్, పెవీలియన్, టాయిలెట్లు, గెజిబో, ధ్యాన, యోగా కేంద్రాలు, యాంపి థియేటర్, నీటి సరఫరా, బిందు సేద్యం వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. జీవీఎంసీ జనరల్ ఫండ్స్‌తో ఈ పార్కు నిర్మాణం జరుగుతోందన్నారు. ప్రజలకు ఆహ్లాదం, ఆరోగ్యం అందించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్గదర్శకాలకు అనుగుణంగా నగరంలో ఖాళీగా ఉన్న జీవీఎంసీ స్థలాల్లో పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు కె.కె.రాజు పేర్కొన్నారు. కార్పొరేటర్ కె.అనిల్ కుమార్‌రాజు, సెక్యూరిటీ శ్రీనివాస్, ప్రసాద్‌రాజు, బాలాజీ కిషోర్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జీవించండి



ఫోర్త్ టౌన్ పీఎస్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ విజయకుమార్



ద్వారకా పీఎస్‌లో రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ఏఎస్‌ఐ రత్నం

సీతమ్మధార: ఎటువంటి నేరాల జోలికి పోకుండా కుటుంబాలతో కలిసి ప్రశాంతంగా జీవించాలని రౌడీషీటర్లకు పోలీసులు సూచించారు. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ ఎస్.విజయకుమార్ కౌన్సెలింగ్ నిర్వహించారు. కొత్త సీఐగా బాధ్యతలు స్వీకరించి వారం రోజులు కావడంతో ప్రతి ఒక్క రౌడీషీటర్‌ను ఆయన విచారించి, పలు వివరాలు, వేలి ముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి అల్లర్లు చేయకుండా ఉండాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మోహన్ రావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

హద్దు మీరితే చర్యలు

ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఏఎస్‌ఐ డి.వి.రత్నం కౌన్సెలింగ్ నిర్వహించారు. గొడవలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. రౌడీషీటర్ల దినచర్యపై ఆరా తీశారు. హద్దు మీరి అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఏఎస్‌ఐ హెచ్చరించారు.

లలితా పీఠానికి పోటెత్తిన భక్తులు



లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



ప్రవచిస్తున్న మహాస్వామి

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. చాతుర్మాస దీక్షలో ఉన్న కుర్తాళ, లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి వారి దర్శనం కోసం భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. జూలై 3 నుంచి సెప్టెంబర్ 29 వరకు చాతుర్మాస దీక్షలు చేపట్టడంతో స్వామీజీ లలితా పీఠంలో భక్తులకు అందుబాటులో ఉంటున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి స్వామి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులను దర్బారు హాల్లో కూర్చోబెట్టి ఒకరి తర్వాత మరొకరిని దర్శనానికి అనుమతించారు. పలువురు భక్తులు తమ సమస్యల నుంచి ఉపశమనం పొందేందుకు మంత్రోపదేశం తీసుకున్నారు. మధ్యాహ్నం పీఠంలో ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. లలితా పీఠం విస్తరణాధికారి మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

ఉపశ్లోకుడే శ్రీకృష్ణుడి మొదటి సంతానం

శ్రీకృష్ణుడికి ప్రద్యుమ్నుడు కంటే ముందే సంతానం ఉందని లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి అన్నారు. లలితా పీఠంలో జరుగుతున్న శ్రీకృష్ణ కథా సప్తాహంలో మూడో రోజు శ్రీకృషుడి గురించి ఆసక్తికరమైన విషయాలను ప్రవచించారు. ప్రద్యుమ్నుడు శ్రీకృష్ణుడి పుత్రుడిగా అందరికీ తెలిసిన వాడని, అతడి కంటే ముందే మగ సంతానం ఉందన్నారు. కంస సంహారం కోసం శ్రీకృష్ణ, బలరాములు మధురలో ప్రవేశిస్తున్నపుడు.. కంసుడికి సుగంధ ద్రవ్యాలు అందజేసే అంధవికారమైన కుబ్జ నుంచి వాటిని స్వీకరించి ఆమె రూపాన్ని సుందరంగా మార్చాడని తెలిపారు. శ్రీకృష్ణుడికి పెళ్లికి ముందే కుబ్జతో మగ సంతానం కలిగిందన్నారు. ఆ కుమారుడి పేరు ఉపశ్లోకుడని, అతడు శ్రీకృష్ణుడికి మహా భక్తుడని స్వామి పేర్కొన్నారు. అనంతరం శ్రీకృష్ణుడు, రాధాదేవి అవతరణ విషయాలను ప్రవచించారు.

ఫోర్త్‌టౌన్ ఎస్‌ఐ గౌరి బదిలీ

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ మహిళా ఎస్‌ఐ ఎన్.గౌరిని దిశ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. మూడేళ్లుగా ఆమె ఫోర్త్‌టౌన్‌లో విధులు నిర్వహించి, పలువురు అధికారుల మన్ననలు పొందారు. గతంలో ఆమె దిశ పీఎస్‌లో పనిచేసి ఫోర్త్‌టౌన్ ఎస్‌ఐగా వచ్చారు. మళ్లీ అక్కడికే గౌరి బదిలీ అయ్యారు.

జాతీయ అవార్డు గ్రహీతకు సత్కారం



ఉపాధ్యాయిని ఉమాగాంధీని సత్కరిస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన శివాజీపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని ఎం.ఉమా గాంధీని మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు ఆదివారం ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షురాలు ఎం.శేషామణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెను శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందించారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం తరఫున గిడుగు అవార్డుకు ఎంపికై సత్కారం పొందిన మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయిని ఎ.హైమావతి, విశ్రాంత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుప్పిలి లక్ష్మీవరప్రసాద్‌ను మహిళలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దుర్గాదేవి, క్లబ్ కార్యదర్శి ఎస్.పుష్పలత. పూర్వ అధ్యక్షులు కె.మాధవి, డి.శిరీష ,కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'సామాజిక నిత్య హితోక్తులు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ జీవీఎల్ నరసింహారావు, సాహితీవేత్తలు

సీతంపేట: తెలుగు భాషకు గౌరవం, ఆదరణ పెరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. కళావేదిక వ్యవస్థాపకుడు, డాక్టర్ నండూరి రామకృష్ణ రచించిన 'సామాజిక నిత్య హితోక్తులు 2' అనే పుస్తకాన్ని ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ముఖ్య అతిథిగా ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తెలుగు భాషకు, సాహిత్యానికి ఆదరణ, గౌరవం తగ్గిందని, ప్రభుత్వాలకే కాదు యువతలోనూ లోపించిందన్నారు. తెలుగు భాష దండగ అనే భావన పిల్లల్లోనే కాదు, తల్లిదండ్రుల్లోనూ ఎక్కువగా కనిపిస్తోందని చెప్పారు. ఇంగ్లిష్ నేర్చుకుంటే ఉపయోగం అన్న భావన ప్రస్తుత తరంలో బాగా పెరిగిందన్నారు. ఇది చాలా ప్రమాదకరమైన సూచనగా ప్రతి ఒక్కరూ పరిగణించాలన్నారు. ఇలాగే కొనసాగితే వందేళ్లలో తెలుగు భాష పూర్తిగా ప్రమాదంలో పడుతుందన్నారు. తెలుగు భాషను కాపాడుదాం అన్న ఆలోచనతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న సాహితీవేత్తలు, సంఘాలు పెద్ద ఎత్తున పూనుకోవాలని పిలుపునిచ్చారు. తెలుగు భాష పరిరక్షణకు తన వంతు సాయం అందించడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. తొలి ప్రతిని వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షులు ఎ.హెచ్.ఎస్.వెంకటరావుకు అందజేశారు. ఆచార్య కోలవెన్ను మలయవాసిని పుస్తకాన్ని సమీక్షించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు ఆచార్య కోలవెన్ను విఠల్ మూర్తి, ఆచార్య జె.అప్పారావు, మల్లాది సోమేశ్వరశర్మ పాల్గొన్నారు.

దళిత సేన నిరసన



నిరసన తెలుపుతున్న దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు, మహిళలు

కంచరపాలెం: మహిళలపై జరుగుతున్న అకృత్యాల విషయంలో సత్వర స్పందన, నేరస్తులపై కఠిన చర్యలు తీసుకువాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు కోరారు. రాజస్థాన్‌లో ఒక అభాగ్యురాలిపై జరిగిన రాక్షస ఘటనపై దళిత సేన తీవ్రంగా ఖండించింది. కంచరపాలెంలోని కార్యాలయం వద్ద దళిత సేన ఆధ్వర్యంలో మహిళలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజస్థాన్ ప్రతాప్‌గాఢ్ జిల్లాలో గిరిజన తెగకు చెందిన మహిళపై భర్తతోపాటు కొందరు దారుణ ఘటనకు పాల్పడటం యావత్ దేశానికే సిగ్గుచేటన్నారు. వివాహేతర సంబంధం అనుమానంతో ఆమెను వివస్త్రను చేసి గ్రామస్తులందరూ చూస్తుండగా బహిరంగంగా ఊరేగించడం అవమానకరమన్నారు. మహిళను పూజించే భారతదేశంలో ఇటువంటి సంఘటనలు, అత్యాచారాలు, అవమానాలు జరగడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వాలు స్పందించి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని గొల్లమాల అప్పారావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సేన నగర అధ్యక్షుడు పుచ్చ కామేశ్వరరావు, ఉపాధ్యక్షుడు తాటిపూడి సీతారాం, ప్రధాన కార్యదర్శి చింతల మల్లికార్జునరావు, కోశాధికారి లంకా రామారావు, నగర కన్వీనర్ గొల్లమాల మీన, కార్యదర్శి పట్నాల ఝాన్సీ, రాంజీ అభ్యుదయ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న అధ్యాపకులు

బీచ్ రోడ్డు: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజీలో చదువుకున్న 1985–90 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం బీచ్ రోడ్డులోని ఓ హోటల్‌లో ఘనంగా జరిగింది. పూర్వ విద్యార్థులు ఒకరికొకరు పరిచయం చేసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆనాటి అధ్యాపకులు వెంకటరావు, పీవీఎస్ రామారావు, డి.రాజారావు, ఎస్.సత్యనారాయణ, స్వర్ణలత తదితరులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎస్.చిరంజీవి, డి.శ్రీనివాసరావు, డి.శివకుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు కుంకుమ పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

కంచరపాలెం: జ్ఞానాపురం పరిధి కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, మంగళగౌరీ వ్రతాలు, విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక దర్శనాలు కూడా ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాల్లో భక్తులు వంటా వార్పు చేసుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, జోజిబాబు తదితరులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

మా వాకర్స్ క్లబ్ కొత్త కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

మురళీనగర్: మురళీనగర్‌లోని మా వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నికలు ఆదివారం ఏకగ్రీవంగా జరిగాయి. ఈ మేరకు వాకర్స్ పార్కులో మా వాకర్స్ క్లబ్ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అన్నెపు దామోదర్ అధ్యక్షతన క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి నేతృత్వంలో రాబోయే రెండేళ్లకు నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆర్నూరి బాలచెన్నయ్య, ఉపాధ్యక్షుడిగా బొడ్డేపల్లి త్రినాథ స్వామి, కార్యదర్శిగా ఉప్పిలి అప్పలకొండ, కోశాధికారిగా సూర్రెడ్డి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా పి.సతీష్ కుమార్, జాలీ వాకర్‌గా తామాడ వెంకటరమణ ఎన్నికయ్యారు.



తెలుగుభేరి పుస్తకావిష్కరణ నేడు

మద్దిలపాలెం: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సోమవారం తెలుగు భేరి పుస్తకావిష్కరణ కార్యక్రమం జరగనుందని తెలుగుదండు అధ్యక్షుడు పరవస్తు ఫణిశయన సూరి ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు హాజరు కానున్నారని పేర్కొన్నారు. తెలుగు పద్యాలు, గేయాల సంకలనంగా రూపొందించిన ఈ పుస్తకాన్ని తెలుగు భాషా పరిరక్షణ దిశగా ఓ అడుగు అని పేర్కొన్నారు. భాషాభిమానులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

ఏయూ అభివృద్ధి విధానం హర్షణీయం



వీసీ ప్రసాదరెడ్డితో సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సాంకేతికంగా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్న విధానంపై పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఏయూ రసాయన శాస్త్ర విభాగంలో చదువుకున్న 1984–86 బ్యాచ్ పీజీ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఈ బ్యాచ్ విద్యార్థులు విభాగాన్ని సందర్శించి, అభివృద్ధి కార్యక్రమాలను ప్రత్యక్షంగా వీక్షించారు. అనంతరం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏయూ క్యాంపస్‌లో జరుగుతున్న నూతన ప్రాజెక్టులు, కార్యక్రమాలను తాము ఎప్పటికప్పుడు ప్రసారమాధ్యమాలు, స్నేహితుల నుంచి తెలుసుకుంటున్నామని తెలిపారు. భవిష్యత్తుకు అవసరమైన నూతన సాంకేతికతలను చేరువ చేసి నేటి తరం విద్యార్థులకు అందిస్తున్న విధానాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. స్టార్టప్, ఇంక్యుబేషన్ సెంటర్‌ను సందర్శించాలని వీసీ పూర్వ విద్యార్థులకు సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల సాధనకు ఐక్యంగా ఉద్యమిద్దాం

సీతమ్మధార: నిరుద్యోగులందరికీ ఉద్యోగాలు కల్పించాలని, ఇందుకోసం ఐక్యంగా ఉద్యమిద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు. సీపీఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సరస్వతీ పార్కు నుంచి డాబాగార్డెన్స్, ఆర్టీసీ కాంప్లెక్స్‌ల మీదుగా లలితా జ్యూయలరీ వరకు నిరుద్యోగ యువతీ, యువకులతో భారీ ప్రదర్శన నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యుడు యూఎస్ఎన్ రాజు అధ్యక్షతన జరిగిన సభలో జగ్గునాయుడు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి.. ఉన్న వాటికి ఎసర పెడుతోందని మండిపడ్డారు. 78వ వార్డు కార్పొరేటర్, సీపీఎం నేత డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను తిప్పికొట్టేందుకు యువత ఉద్యమాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు కె.సంతోష్, ఐద్వా రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.